క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఉండనున్నట్లు అయిజ ఏడీఈ గోవిందు, గట్టు ఏఈ చెన్నయ్యలు ఓ ప్రకటనలో తెలిపారు. గట్టు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు, గొర్లఖాన్‌దొడ్డి సబ్ స్టేషన్ నుంచి 11కేవీ లైన్ కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గట్టు, మాచర్ల సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. మెరుగైన విద్యుత్‌ను అందించే క్రమంలో మరమ్మతులతో పాటు ప్రధాన లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని గట్టు, సల్కాపురం, తారాపురం, యల్లందొడ్డి, రాయాపురం, గొర్లఖాన్ దొడ్డి, మాచర్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయిజ: విద్యుత్ సరఫరాలో సమస్యలను తొలగించేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా సోమవారం ఎక్లాస్‌పురం, దేవబండ శివార్లలోని వ్యవసాయ భూములకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ 33/11 సబ్ స్టేషన్ నుంచి బీ తిమ్మాపూర్ 11 కేవీ ఫీడర్‌లో లూజ్ కలెక్షన్ సరిచేసేందుకు, లైన్ వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మండలంలోని బీ తిమ్మాపూర్ ఫీడర్ పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపారు.

24న అవగాహన కార్యక్రమం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో శాంతినగర్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 24న కమ్యూనిటీ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, యువకులు పాల్గొనాలని ఎస్‌ఐ కోరారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో బూత్ నంబర్లు 168, 169 లోని ప్రజలను కలుస్తూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మోహన్, రాఘవేంద్ర, రవి, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, శివ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంతో పాటు బీవీ పల్లి, సాసనూలు గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో విజయ్, శివ, రాజు, మన్యం, శివరాంరెడ్డి, మధు, సురేష్, నందు, కిశోర్ ఉన్నారు.



అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ బీజేపీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ 10 ఏళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల నుంచే ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు, రైతు వేదికలు, వైకుంఠదామాల నిర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజి, నరసింహులుపాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

గట్టు: మండలంలోని బోయలగూడెం గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం బీజేపీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన ఉప్పరి అనంతమ్మ గుడిసె గ్యాస్ లీకేజీ కారణంగా అగ్నికి అహుతి అయిన విషయం తెలిసిందే. బీజేపీ నాయకులు బల్గెర శివారెడ్డి, కిట్టు స్వామి, బెల్లం నర్సింహులు, సంజీవనాయుడు, లింగన్న, చంద్రశేఖర్ అనంతమ్మను పరామర్శించి, బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు

ధరూరు: మండల కేంద్రంలో ఈ నెల 22, 23వ తేదీల్లో రెండు రోజులు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సభలకు హోసన్నా మినిస్ట్రీస్ గుంటూరు నుంచి ముఖ్య వక్తలు, వాక్యోపదేశకులుగా జాన్ వెస్లీ, అబ్రహాంలు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్ర 6.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు అందరూ ఆహ్వానితులేనని స్థానిక హోసన్నా సంఘం సభ్యులు తెలిపారు.

అధ్వానంగా అయిజ రోడ్డు

- గుంతల రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అయిజకు వెళ్లేదారిలో తెలంగాణ చౌరస్తా (మేలచెర్వు) వద్ద రోడ్డు దుస్థితి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రం నుంచి అయిజకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ దారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి..

వివిధ పనుల నిమిత్తం గద్వాల – అయిజ, అయిజ – గద్వాలకు వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డు మొదలుకొని కొండపల్లి రోడ్డు వరకు అడుగడుగునా రహదారి గుంతలతో దర్శనమిస్తోంది. రాత్రి వేళలో ప్రయాణం చేయాలంటే నరకయాతనే ఉంటుంది. గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలు బారినపడుతున్నా, రోడ్డు మరమ్మతులు పట్టించుకునే నాథుడు కరువయ్యారని, పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇక తెలంగాణ చౌరస్తా (మేలచెర్వుకు)వెళ్లే దారిలో కంకర తేలడంతో వాహనదారులు అదుపు తప్పడంతో పాటు విపరీతమైన దుమ్ము వస్తుండడంతో వాహనదారులు, అక్కడ ఉన్న దుకాణదారులు అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు, పాలకులు..

అయిజ వేళ్లే దారి గుంతలయమంగా మారి చాలా నెలలు అయినప్పటికీ వాటి మరమ్మతులకు అధికారులు, పాలకులు చొరవ చూపడం లేదు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో అడపదడపగా మరమ్మతులు చేపట్టినప్పటికి అది మూణ్ణాళ్లకే మళ్లీ గుంతలు ఏర్పడడం నాణ్యతకు నగుబాటుగా మారింది. కేవలం ఇలా నాణ్యత లేకుండా అక్కడక్కడ గుంతలు పూడ్చడం, మట్టి వేసి గుంతల పూడ్చడం వంటి చర్యలు చేపట్టి చేతులు దులుపు కుంటున్నారు. రోజుకు వేలాది వాహనదారులు రాకపోకలు సాగించే అయిజకు



గుంతలమయంగా అయిజకు వెళ్లే రోడ్డు



వేళ్లే ప్రధాన రహదారే ఈ పరిస్థితి ఉందంటే, మరీ గ్రామాలకు, కాలనీలకు వెళ్లేదారులు పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వాహనదారులు పెద్ద ఎత్తున్న ఇబ్బందులు పడుతూ, పలుమార్లు ప్రమాదాలు గురవుతున్న పట్టించుకోకుండా చూసిచూడనట్లుగా వ్యవహరించడం పట్ల వాహనదారులు, స్థానిక ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు అయిజకు వెళ్లాలంటే ఈ దారిలో వెళ్తున్నా, వారికి ఈ గుంతల దారులు కనిపించట్లేదా? అంటూ పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు త్వరలో మరమ్మతులు చేపడుతామంటూ చెప్పి మర్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు అయిజ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> అయిజ రోడ్డుకు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి 3 కి.మీ. వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అయితే బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయట్లేదు. కొండపల్లి రోడ్డు దాటిన తర్వాత రోడ్డు మరమ్మతుకు టెండర్లు వేశారు. ఎవరూ టెండర్ వేయలేదు. త్వరలో మెయింటెన్స్ చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.
>
> – రాజేశ్వరి, ఏఈ, ఆర్‌అండ్‌బీ, గద్వాల

భగవద్గీత జ్ఞాన ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

అయిజ: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అయిజ, బింగుదొడ్డి కమిటీ సభ్యులు ఆదివారం మండల కేంద్రంలో, యాపదిన్నె గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు ఆఫ్ రికార్డ్ అవార్డ్ గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పంచారు. తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ రహస్యంను గ్రామస్తులకు తెలిపారు. శ్రీరామ పదంలోని ఆధ్యాత్మిక అంశాన్ని తెలిపారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు నరేష్, వినోద్, భాస్కర్, విజయ్, దేవేందర్, వీరేష్, మోహన్, కళావతి, ఈశ్వరి, భారతి, లక్ష్మి, అక్షయ, రాధమ్మ, లక్ష్మణ్, ఈరన్న, వెంటేష్, రామచంద్ర, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జాబ్‌కార్డులున్న కూలీలందరికి ఉపాధి పనులపై అవగాహన కల్పించి వారు పనులు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది పనులు జరుగుతున్నా ప్రదేశాలను పరిశీలించి మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు ఉదయం, సాయంత్రం పనులు చేపట్టాలని సూచించారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుల ఇబ్బందులు



జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వేస్టేషన్‌లో విద్యార్థులు, ప్రయాణికులు అధిక సంఖ్యలో ఆదివారం తెలవారుజామున హంద్రీ ఎక్స్‌ప్రెస్ కోసం వేచి ఉన్నారు. విద్యార్థులకు మహబూబ్‌నగర్‌లో పదో తరగతి విద్యార్థులకు గురుకుల పరీక్ష ఉండడంతో బాలికలు అధిక సంఖ్యలో అక్కడికి వచ్చారు. మూత్రశాలలకు తాళం వేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలకు టికెట్లు తీసుకున్న చెట్టు కిందే పార్కింగ్ ఏర్పాటు చేశారు. హై లెవల్ ప్లాట్ ఫామ్ గురించి ఈ సారైన గెలిచే ఎంపీ పట్టించుకుంటారో లేదో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు తెలుపుతున్నారు. వృద్ధులు, విద్యార్థులు రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ స్వాతి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ స్వాతి ప్రజలకు ఆపదలో ఉపయోగపడే డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలతో పాటు రైతులకు వివిధ ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మైనర్ బాలికలను వేధిస్తే పోక్సో చట్టం ద్వారా చర్యలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, తదితరులు ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ఆలయ లాంఛనలతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామివారికి అభిషేకం చేసి శాలువతో సన్మానించారు. వారి వెంట ఆలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నాటిన మొక్కలు ఎండు ముఖం



ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని అలంపూర్ రహదారిలో మొక్కలు ఎండకాలంలో నాటించడంతో ఎండుముఖం పట్టాయి. ప్రజలకే నీరు లేక ఇబ్బందులు పడుతుంటే మొక్కలకు నీరు ఎలా పోస్తారని వాహనదారులు వాపోతున్నారు. వర్షాలు పడుతుంటే మొక్కలు నాటిస్తారు, కాని పూర్తి ఎండాకాలంలో మొక్కలను నాటించి వాటిని ఎండగొడుతారా? లేక నీరు పోసి పెంచుతారా అనే అయోమయం నెలకొంది. పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా అతను బాధ్యతలు స్వీకరించకముందే నాటించారని తెలిపారు. గ్రామానికి నీరు అందని సమయంలో మొక్కలు ఎందుకు నాటించారో తెలియడం లేదని పేర్కొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తకోట రూరల్: పట్టణకేంద్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్నివైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీరామ నవమి నిర్వహించిన తర్వాత త్రయోదశిన కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కల్యాణానికి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. మాజీ ఎమ్మెల్యే రావుల రవింద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, రాష్ట్ర మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బద్రినాథ్, మున్సిపాల్ చైర్‌పర్సన్ సుఖేశిని, నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించాలి

పెబ్బేరు రూరల్: సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించి, నిర్ణీత గడువులో సమాచారం దరఖాస్తుదారులకు అందజేయాలని సామాజిక కార్యకర్త సంతోష్‌కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో బోర్డులు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు అధికారులు అందుబాటులో ఉన్న సమాచారం ఇవ్వడానికి కాలయాపన చేస్తున్నారని తెలిపారు.

ఇరుకైన రహదారులతో ఇక్కట్లు



మస్తీపురం మీదుగా వెళ్తున్న ఇరుకైన ప్రాజెక్టు రహదారి

అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి జూరాల ప్రాజెక్టు మీదుగా గద్వాలకు వెళ్తున్న ప్రధాన రహదారి మస్తీపురం మీదుగా వెళ్తుంది. గ్రామం మధ్యలో ఇరుకైన రహదారి కావడంతో భారీ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు దాపరించాయి. నాలుగు రోజుల కిందట వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఇరుకైన రహదారిపై అదుపు తప్పి గ్రామానికి చెదిన ఐజీ రమేష్ రెడ్డి ఇంటి కాంపౌండ్ వాల్‌ను ఢీకొట్టింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం కాకపోయిన తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా ఆత్మకూర్ పట్టణంలో రహదారిపై డివైడర్‌లు నిర్మించడంతో ఇరుకైన రహదారి తయారైంది. ఇలాంటి రహదారిపై మొరం మట్టిని కప్పి ఉంచడంతో ప్రయాణికులు తమ వాహనాలకు అతి జాగ్రత్తగా నడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఇరుకైన రహదారులను గుర్తించి ప్రమాదాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గాలివానకు నేలకొరిగిన చెట్లు



పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్త సూగూరులో శనివారం రాత్రి కురిసిన వర్షం, గాలి వీచడంతో వ్యవసాయ పంట పొలాల వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమీద పడ్డాయి. కొన్ని స్తంభాలు విరిగిపోయాయి. దీంతో వ్యవసాయ పంపు సెట్లకు కరెంట్ నిలిచిపోయింది. అధికారులు స్పందించి స్తంభాలను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

పెబ్బేరు రూరల్: భూ తగాదాలతో పెబ్బేరు పట్టణ కేంద్రంలో వ్యక్తిపై ఆదివారం దాడి చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన గుండ్రాతి నర్సింహాగౌడ్ ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వనపర్తి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, మార్గమధ్యలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కారులోంచి నలుగురు, బైక్‌పై ఇద్దరు వచ్చి దాడి చేశారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. నర్సింహాగౌడ్‌కు దాయాదులకు భూతగాదాలు నడుస్తున్నాయని, కోర్టు పరిధిలో ఉన్నట్లు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

కేటీదొడ్డి: అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. గద్వాల వైపు నుంచి ఎరుకలి రాజేష్ వివిధ గ్రామాల నుంచి 10 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి రాయచూర్‌కు వాహనంలో తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో మండలంలోని మల్లాపురంతండా శివారులో తనిఖీల్లో భాగంగా పట్టుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించి రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టణంలో పడకేసిన పారిశుద్ధ్యం



టీచర్స్ కాలనీలో మురుగుకూపం



మద్దిగుంత కాలనీలో మురుగుకుంటలో పెరిగిన ముళ్ల పొదలు

- మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడే..
- డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించని వైనం
- రోడ్లపైకి చేరుతున్న మురుగు

అయిజ: పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి. దానికోసం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. ఎప్పటికప్పుడు రోడ్లు ఊడ్చుతూ ఉండాలి. మురుగు కాల్వల్లో పూడికను ఎప్పటికప్పుడు తీసివేస్తూ ఉండాలి. అయిజ మున్సిపాలిటీలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పాత కాలనీల్లో వీలైనంత మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించారు. కొత్త కాలనీల్లో అనేక ప్రదేశాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసింది. ఇప్పటికే కొన్ని పాత కాలనీల్లో కూడా పారిశుద్ధ్యం లోపించింది.

వివిధ కాలనీల్లో..

మున్సిపాలిటీలోని మడ్డిగుంత కాలనీల్లో కొన్ని సంవత్సరాల నుంచి మురుగు నీరు నిలువ ఉంటోంది. రోడ్డుపై వెళ్తున్న వారికి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు నిలువ ఉండడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. దోమల ఉధృతి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలో టీచర్స్ కాలనీ, భరత్‌నగర్, నరసింహ కాలనీ, గాజులపేట కాలనీల్లో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పట్టణాన్ని పరిశుభ్రంగా చేసేందుకు సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

> **నిధులు మంజూరైతే నిర్మాణం చేపడుతాం..**
>
> 
>
> మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. పాత పట్టణంలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. కొత్త పట్టణంలోని కొన్ని ప్రదేశాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాం. చాలా కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. బడ్జెట్ లేకపోవడంతో పనులు కావడం లేదు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడానిక ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం పనులు ప్రారంభిస్తాం.
>
> – గోపాల్, ఏఈ

అండర్ డ్రెయినేజీ నిర్మించాలి



పట్టణంలో పాత కాలనీల్లో గతంలో నిర్మించిన డ్రెయినేజీలు శిథిలమయ్యాయి. దాని వల్ల మురుగు నీరు ముందుకు వెళ్లడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ఉధృతి పెరుగుతోంది. చెత్తాచెదారం మురుగు కాల్వల్లో పడేస్తున్నారు. ఆధునిక టెక్నాలజీతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడితే బాగుంటుంది.

– శ్రీనివాసులు, అయిజ

కాలనీల్లో నిర్మాణం చేపట్టాలి



పట్టణంలో అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. ఎప్పటికప్పుడు రోడ్లు ఊడ్చుతూ ఉండాలి. మురుగు కాల్వల్లో పూడికను ఎప్పటికప్పుడు తీసివేస్తూ ఉండాలి. పాత కాలనీల్లో వీలైనంత మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలి.

– తిరుమలేష్, అయిజ

కొత్త కాలనీల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



టీచర్స్ కాలనీ, భరత్ నగర్, నరసింహ కాలనీ, గాజులపేట కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నివాసగృహాల నుంచి వచ్చిన మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో పారిశుద్ధ్యం పడకేసింది. దోమల ఉధృతి చెంది ప్రజలు రోగాలపాలవుతున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి పారిశుద్ధ్యం మెరుగుపరచాలి.

– అమరేష్, అయిజ

పారిశుద్ధ్యం లోపించింది..



మడ్డి గుంత కాలనీల్లో మురుగు నీరు నిల్వ ఉంటోంది. పిచ్చి మొక్కలు పెరిగాయి. దోమల ఉధృతి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. అధికారుల స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– వెంకటేష్, అయిజ